

17,18 తేదీల్లో శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీల సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ అన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం రిసోర్స్ పర్సన్ మూర్తి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, డిజిటల్ అసిస్టెంట్‌తో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ హాజరు అయ్యేలా చూడాలన్నారు. హాజరు అయిన వారికి జిపిడిపి పై అవగాహన కల్పించడం ద్వారా గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు.

అవినీతి ట్రాన్స్‌ఫార్మర్లు

- షిఫ్టింగ్ ఛార్జీలు లేకుండా రాత్రికి రాత్రే బదలాయింపు
- విషయం పొక్కడంతో తిరిగి యథాస్థానానికి
- అల్లవరంలో విద్యుత్ శాఖ అధికారుల లీలలు



ఈనెల 9న రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా ఉన్న స్తంభం



ఈ నెల 10న కొమరగిరిపట్నంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను యథాస్థానంలో అమరుస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది

ప్రజాశక్తి-అమలాపురం

గృహ వినియోగానికి కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలన్నా...ఉన్న విద్యుత్ కనెక్షన్ మార్పు చేసుకోవాలన్నా... అధికారులు చెప్పే నిబంధనలు అన్నీఇన్నీ కావు. ఇంటి పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లినా... రహదారికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు జరిపినా... వాటిని సరి చేయాలంటే ఉదాసీనంగా ఉండే విద్యుత్ అధికారులు... రాత్రికి రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లను మార్చేయడం... అందులోనూ ఎలాంటి నిబంధనలు పాటించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒక విద్యుత్ సర్వీసు ఒకచోట నుంచి మరో ప్రాంతానికి మార్చుకునేందుకు షిఫ్టింగ్ ఛార్జీల రూపంలో విద్యుత్ శాఖకు కొంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. తర్వాత విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ మార్పు కోసం ప్రక్రియను ప్రారంభిస్తారు. రిజిస్ట్రేషన్ చేసి ఎస్టిమేషన్ వేసి పనులు చేపడుతారు. కానీ ఇవన్నీ లేకుండానే విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను ఒక చోట నుంచి మరో చోటికి మార్చేస్తున్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం ఆదివిష్ణు కౌశిక్ సమీపంలోని ఆక్వా చెరువుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్సాఫార్మర్ రాత్రికి రాత్రి కనిపించకుండా పోయింది. విషయం బయటకు రావడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రాత్రికిరాత్రి యథాస్థానానికి చేరుకుంది.

కొమరగిరి పట్టణానికి చెందిన ఆక్వా రైతు గుర్రం గంగాధరంకి చెందిన చెరువులకు విద్యుత్ సరఫరా నిమిత్తం 1411270213003014 నెంబర్‌తో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఓడలరేవు గ్రామ బివిసి ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులోని నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న ఓ ఆక్వారైతుకు విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంది. సదరు రైతు విద్యుత్ అధికారుల మధ్యవర్తిత్వంతో గంగాధరం పేరున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈనెల 9వ తేదీ రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను కొమరగిరిపట్నం నుంచి అల్లవరం తరలించారు. ఈ విషయం బయటకు రావడంతో 10వ తేదీన మరలా ఓడలరేవు నుంచి కొమరగిరిపట్నం తరలించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ముడుపులు తీసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని స్థానిక ఆక్వా రైతులు చెబుతున్నారు. ఆక్వా చెరువులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.25వేల వరకు డిమాండ్ చేస్తున్నారని వారు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్పు విషయంలో సంబంధం ఉన్న విద్యుత్ శాఖ ఉద్యోగిపై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్టు సమాచారం. అందులో భాగంగా ఇటీవల అతన్ని కొమరగిరిపట్నం బదిలీ చేశారని తెలిసింది. దీనిపై ఎల్ఐ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ఘటన ఎలా జరిగిందో తనకు తెలీదన్నారు. విద్యు త్ బిల్లులు, వసూళ్లలో తాను బిజీగా ఉన్నానని తెలిపారు. ఈ ఘట నపై ఆరా తీస్తున్నానని, అన్ని విషయాలు తెలుసుకుంటానని తెలిపారు.

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'



జగనన్న తోడు నిధులను లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

చిరువ్యాపారులకు జగనన్న తోడు నిధులు వ్యాపారాభివృద్ధికి మేలు చేకూర్చుతూ చేయూతనందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం సిఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఏడో విడత వడ్డీ రాయితీ నిధులను, ఎనిమిదో విడత జగనన్న తోడు నిధులను లబ్ధిదారుల ఖాతాలలో ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా జమ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఉపాధికి ఊతంగా స్వయం ఉపాధితో జీవిస్తూ మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్న చిరు వ్యాపారులు,అధిక వడ్డీల బారిన పడకుండా వారికి తోడుగా జగనన్న తోడు పథకం నిలిచి వారి ఇంట ముందుగానే సంక్రాంతి సంతోషాలు వెల్లివిరిసేలా వడ్డీ రీయింబర్స్మెంట్ నిధులు జమచేయడం జరిగిందన్నారు. ఏడవ విడతలో ఈ పథకం కింద రుణాలను పొంది వడ్డీతో సహా సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఇప్పటికి ఎనిమిది విడతలుగా చిరు వ్యాపారులకు ప్రభుత్వ రుణాలు అందజేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడో విడత గా వడ్డీ రాయితీ నిధులు 22,840 మంది లబ్ధిదారులకుగాను రూ. 55 లక్షల 9 వేల 533 లు జమ చేశారన్నారు. ఎనిమిదో విడతగా జిల్లాలో 11,177 మంది లబ్ధిదారులకు రూ.11.17 కోట్ల మేర రుణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్సి కుడిపూడి సూర్య నారాయణరావు, రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు, పురపాలక సంఘ ఛైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, ఎల్‌డి ఎంకె.శ్యాం బాబు, ఎపిడి ఎంఎం.జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు ఏకకాలంలో నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను అందరూ తప్పనిసరిగా పాటించాలని, నాలుగేళ్లుఒకే చోట పని చేసిన వారికి బదిలీలు నిర్వహణ అంశాలపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాస్థాయి అధికారులకు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో ఇటీవల భారత్ లో ఎన్నికల సంఘం విజయవాడ కేంద్రంగా నిర్వహించిన సమీక్షల సారాంశాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నాలుగు సంవత్సరాలు పైబడిన ఉద్యోగులను తప్పనిసరిగా నేటివిటీ కూడా పరిగణనలోనికి తీసుకుని నేటివిటీ ఉన్న నియోజకవర్గంలో కాకుండా పక్కన నియోజవర్గానికి బదిలీ చేయాలని సూచించారు. 8 నుంచి 10 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని నియమిస్తారన్నారు. గత ఎన్నికల నిర్వహణలో వివాదాస్పదంగా వ్యవహరించి రిమార్కులు, కేసులు ఉన్న అధికారులకు ప్రస్తుత ఎన్నికలలో ఎటువంటి విధులు కేటాయించ రాదని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల విధులకు కేటాయించరాదన్నారు. తుది జాబితా ప్రచురణ అనంతరం అధికారులకు విధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. గర్భిణులు, వికలాంగులకు ఎన్నికల విధులకు కేటాయించరాదని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఎన్నికల విధులు నిర్వహించేందుకు సన్నద్ధం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు విధులు బాధ్యతలను కేటాయించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా స్వేచ్ఛాయుత, శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వసన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా పోలీసు, ఎస్ఇబి, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖల ఎన్ఫోర్స్మెంట్ విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు తదిత రులు పాల్గొన్నారు.

'మైనేని'కి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక యుటిఎఫ్ హోమ్ లో మైనేనివెంకటరత్నం వర్ధంతి సభ గురువారం నిర్వహిచారు. ఎంఎల్‌షి ఇళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ 1974లో కు ముందు మైనేని వెంకటరత్నం ప్రాథమిక ఉపాధ్యాయ ఫెడరేషన్ పత్రిక సంపాదక సభ్యునిగా ఉండేవారన్నారు. యుటిఎఫ్ ఏర్పడిన తర్వాత ఐక్య ఉపాధ్యాయకు సంపాదకునిగా ఉంటూ పదునైన సంపాదికీయాలు, వ్యాసాలు, కథలు, గల్పికలు, పుస్తక పరిచయాలు రాశారన్నారు. ఇవన్నీ ఉపాధ్యాయ సైద్ధాంతికంగా ఆలోచింపచేశాయని, కార్యకర్తలకు తోడ్పాటునిచ్చాయనిఅన్నారు. మైనేని ఆలోచనలు ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. మైనేని వెంకటరత్నం యుటిఎఫ్ పత్రిక ఐక్య ఉపాధ్యాయకు సుమారు 15 సంవత్సరాలు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఐక్య ఉపాధ్యాయ పత్రికను ఉపాధ్యా యుల కలదీపికగా తీర్చిదిద్దారని



నివాళులు అర్పిస్తున్న ఎంఎల్ ఐవి తదితరులు

ఈ కార్య క్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పి సురేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.వి రాఘవులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు 'రెడ్‌క్రాస్' సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నడిపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దొండపాటి లోవరాజు కుటుంబం స్వరం కోల్పోయింది. బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు చేతుల మీదుగా గురువారం వంట సామాగ్రి, హైజెనిక్ కిట్స్, టార్పాలిన్, బియ్యం, చీరలు ,దుప్పట్లు పంపిణీ చేశారు.

కొబ్బరి పీచు బొమ్మల షాపు పరిశీలన

ప్రజాశక్తి -మామిడికుదురు

డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థులు రావెప్ (స్థానిక ఉద్యాన ఉత్పత్తులు అవగాహనలో భాగంగా) విద్యార్థులు పాశర్లపూడి లో నాబార్డ్ సహాయంతో ఆక్సిజన్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కొబ్బరి పీచు బొమ్మల షాపును సందర్శించారు. మహిళలు తయారు చేస్తున్న కొబ్బరి పీచు బొమ్మల తయారీ విధానం పై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇది ప్రాజెక్ట్ వర్క్ కింద పని చేస్తుందని విద్యార్థులు తెలియజేశారు. కార్యక్రమం లో విద్యార్థినులు, అలాగే గ్రామ దుకాణ మహిళలు ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం మండల విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవి ఫిడర్ పరిధిలో మరమ్మతులు మరియు ట్రీ కట్టింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఎపిఇపి డిసిఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవి కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఆనాతవరం, అయినా పురం, ముమ్మిడివరం ఎంహెచ్ క్యూ1, ఎంహెచ్ క్యూ11, ఆర్ డ్వెస్, ఠానేలంక, కొత్త లంక ఫిడర్లు పరిధిలోని గ్రామాలక సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

వివిధ రూపాల్లో నిరసన



మామిడికుదురులోని గోదావరిలో అంగన్‌వాడీల జలదీక్ష

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల సాధన కోసం గత 31 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు పలువిధాలుగా నిరసన తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు.

అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాల వద్ద 24 గంటల దీక్షను గురువారం మండపేట ప్రాజెక్టు సభ్యులు పాల్గొన్నారు. ముందుగా 24 గంటల దీక్షను సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం అమలాపురం ప్రాజెక్టు కార్యదర్శి బేబీ గంగా రత్నం, గన్నవరం ప్రాజెక్టు లీడర్ వెంకటలక్ష్మి ప్రారంభించా జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు పింకే వెంకటేశ్వరరావు వాళ్ల బందం సంఘీభావం తెలిపి అంగన్‌వాడీల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం జరిగే వరకూ ఈ సమ్మె కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, అంగన్ వాడీ జిల్లా కోశాధికారి అమూల్య, దైవ కప మండపేట ప్రాజెక్టు అధ్యక్షులు మేడిశెట్టి బేబీ, ఎస్ విజయలక్ష్మి, సి హెచ్.సత్యవేణి, ఎం.కమల తదితరులు వీరికి మద్దతుగా వందలాది మంది పాల్గొన్నారు.

మండపేట స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు. వెంటనే వేతనాలు పెంచుకున్నట్లు మరో జిఒ ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, భీమా అమలు చేయాలి. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయలి. ఆయిల్, కందిపప్పు, క్వాంటిటీ పెంచాలి. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి. సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడిలు పాల్గొన్నారు..

ముమ్మిడివరం ఎస్మా ను రద్దు చేసి, సమస్యలు పరిష్కారించే వరకు సమ్మె కొనసాగుతుందని ముమ్మిడివరం ప్రాజెక్ట్ అంగన్ వాడి అధ్యక్ష కార్యదర్శులు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గా మల్లేశ్వరిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు దీక్షా శిబిరంలో నిరసనను కొనాగించరు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వారి సాంప్రదాయ పండగైన సంక్రాంతి పండగ సమయంలో కూడా సమ్మెను కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం ఈ విధంగా ఇబ్బందులకు గురు చేయడం మంచిది కాదని, ఇప్పటికైనా అంగన్ వాడి డిమాండ్ల ను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న ముగ్గురు అస్వస్థతకు గురి కావడంతో వారిని హుటాహుటీన స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం శిబిరంలో అంగన్‌వాడీలకు తమకు గౌరవ వేతనం వద్దు, కనీస వేతనం కావాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నిరసనలో సెక్టార్ లీడర్ ధనలక్ష్మి, జి.శ్రీదేవి, వి.తలుపులమ్మ, ఎన్.విజయకుమారి, కె.సత్యవతి తదితరులతో పాటు అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ అస్వస్థతకు గురైన వారిని పరామర్శించి, వైద్యులను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని బరోసానిచ్చారు.



అమలాపురంలో అంగన్‌వాడీల నిరాహార దీక్ష, మద్దతుతెలిపిన ప్రజాసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, యుటిఎఫ్ నాయకులు



రామచంద్రపురం పట్టణంలో సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు




ముమ్మిడివరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీని పరామర్శిస్తున్న దుర్గాప్రసాద్



మండపేటలో సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



అందరితో కలిసి వెళ్లడమే లక్ష్యం

నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

వచ్చే ఎన్నికల్లో అందరితో కలిసి వెళ్లడమే లక్ష్యమ రామచంద్రపురం నియోజకవర్గం వైసిపి ఇంఛార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ అన్నారు. ఆయన గురువారం కె.గంగవరం మండలంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు అభిమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇది మొట్టమొదటి కార్యకర్త సమావేశం అని అన్నారు. అందరం ఒకే గొడుగు కింద పనిచేయాలని సూచించారు. తన తండ్రి 40 ఏళ్ళుగా మీ అందరికీ సేవలందించారని అంతకుమించి తాను సేవలు అందిస్తానని తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ త్వరలో ద్రాక్షారామ నుంచి ప్రారంభమయ్యే ప్రజా సాధికార యాత్ర విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కె.గంగవరం జెడ్పిటిసి సభ్యులు ఓబులనేని వరలక్ష్మి రాజకుమార్, వైసిపి నాయకులు పెట్టా శ్రీనివాస్, పంపన సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఇంత సంతోషం, పార్టీ నాయకులు గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా వైసిపి

ముస్లింలకు ఎప్పుడూ వైసిపి పార్టీ అండగా ఉంటుందని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురు వారం రామచంద్రపురం పట్టణం లో పెద్ద మసీదులో ముస్లిం పెద్దలను కలిసి వారితో అనేక విషయాలను ఎంపీ బోస్ చర్చించారు. పట్టణంలో శ్మశానం వాటిక కు నిధులు కావాలని జామీయా మసీదు అధ్యక్షులు కరీం విన్నవిం చారు. దీనికి బోస్ సమాధానం ఇస్తూ మున్సిపల్ అధికారులతో మాట్లాడారు త్వరలో నే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తానెప్పుడూ ముస్లింలకు అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మస్తాన్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుకు డిమాండ్

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రజా వ్యతిరేక కొత్త భూ చట్టమైన ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెఎల్‌వి ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రజా, రైతు వ్యతిరేక ఎపి ల్యాండ్ టైట్లింగ్ చట్టం 22 ను రద్దు చేయాలని కోరుతూ గురువారం న్యాయ వాదులు విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ జాతీయ రహదారి 216 పై గాంధీ బొమ్మ సెంటర్ వరకు సాగింది. గాంధీ సెంటర్ లో గాంధీ విగ్రహానికి న్యాయవాదులు వినతి పత్రం పెట్టి, కొత్త భు చట్టమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 2022ను రద్దు చేయాలని కోరుతూ మానవహారం నిర్వహించారు. నిరసనలో కార్యదర్శి రామాయణం మనేశ్వరరావు, దొనిపాటి ఆంజనేయులు, గ్రంధి వెంకట రామారావు, అయినవిల్లి వలియా బాబ, గుత్తుల శ్రీనివాసరావు, కాశి సింహాద్రి వర్మా ఎండి అలీ హసన్ ముడే వెంకట్రావ్ వడ్డీ త్రిమూర్తులు తో పాటు పలువురు పాల్గొన్నారు.

మాత, శిశు మరణాల రేటు తగ్గించాలి

ప్రజాశక్తి-అమలాపురం

మాతాశిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా వైద్య సేవలు సమన్వ య అధికారి సంయుక్తంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మాతా శిశు మరణాల కేసులపై క్షుణ్ణంగా విచారించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి, వివిధ పిహెచ్‌సిలకు చెందిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

దీక్ష భగ్నం అప్రజాస్వామికం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అమలాపురం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులకు రావలసిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి బకాయిల కొరకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనవరి 9, 10 తేదీలలో విజయవాడలో చేపట్టిన 36 గంటల దీక్షను పోలీసులు భగ్నం చేయుట అప్రజాస్వామిక విధానం అని వెంకటేశ్వర్లు ప్రకటించారు. గురువారం అమలాపురం యుటిఎఫ్ హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సుమారుగా రూ.18,096 కోట్లు చెల్లించవలసి ఉందన్నారు. ఈ ఆర్థిక బకాయిలు చెల్లించేవరకు ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు చేసిన మా పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. దీనిలో భాగంగా 14న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాన్ని దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు బేతినీడి శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సురేంద్ర, జిల్లా ట్రెజరర్ కేశవరావు పాల్గొనినారు.

నేరాలు ఘోరాలు

పలుచోట్ల కోడి కత్తులు సీజ్

ప్రజాశక్తి - పెరవలి, గోకవరం

సంక్రాంతి సందర్భంగా కోడి పందాల్లో కోడి పుంజులకు కట్టే కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నడిపల్లి కోట గ్రామానికి చెందిన వీరమల్లు రామకృష్ణ కోళ్లకు కట్టేందుకు సిద్ధం చేసిన 40 కోడి కత్తులు, ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామానికి చెందిన నందమూరి వెంకటేశ్వరరావు నుంచి 60 కోడి కత్తులు సీజ్ చేసి ఇరువురిని అదుపులోనికి తీసుకున్నట్లు సిఐ కె.వెకంటేశ్వరరావు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఎవ్వరైనా కోడి పందాలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినా, వారికి ఎవ్వరైనా సహకరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గోకవరంలోని వెలమపేటలో కోడికత్తులు తయారుచేస్తున్న ఎదురాడ వెంకటరమణను అరెస్టు చేసి, అతని నుంచి 277 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. ఎస్పి జగదీష్ ఆదేశాల మేరకు, నార్త్ జోన్ ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచి సిబ్బందితో దాడులు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు.

100 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్న సంక్రాంతి, ఎన్నికల నేపథ్యంలో 100 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ నాగార్జునరాజు గురువారం తెలిపారు. సంక్రాంతి సందర్భంగా గతంలో కోడిపందేలు, జూదాలు, మద్యం, సారా, గంజాయి అమ్మకాలు నిర్వహించిన వారిని గుర్తించి బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గత ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్ల కేసులో ఉన్న వారందరినీ గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో సారా బట్టీలపై దాడుల నిర్వహించి బెల్లపు ఊటను ధ్వంసం చేసి నాటు సారాను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్యాల గ్రామం తాడిపూడి కెనాల్ వద్ద నాటు సారా బట్టిపై దాడి చేసి సారా తయారు చేయుచున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారు చేయుటకు నిల్వ చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లికి చెందిన వెలగన నాగేశ్వరరావును నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఇబి సిఐ డి.సుధ తెలిపారు. అతని నుంచి 20 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్ఇబి అధికారులు, సిబ్బంది పి,సుధీర్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామంలో రెండు ప్రాంతాలలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు గోకవరం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నాఉ. వారి నుంచి రూ.26,730 నగదు, నాలుగు సెట్స్ ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

అక్రమంగా తరలిస్తున్న 2 టన్నుల రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లాకు చెందిన కడలి లక్ష్మణ్ రాజానగరంలోని కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జొన్నాడ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారని ఎస్ఐ తెలిపారు.

విరవాడలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలో విరవాడలో బుధవారం రాత్రి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు విరవాడ గ్రామంలో ఎస్.అప్పారావు తన భార్య చిన్ని, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అప్పారావు కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఖమ్మంలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తుండగా అప్పారావుకు గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఎన్.సురేష్ పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరి మధ్య స్నేహం కొన సాగి ంది. పది రోజుల క్రితం వీరిద్దరి మధ్య ఏదో విషయమైన వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బుధ వారం రాత్రి సురేష్ విరవాడలోని అప్పారావు ఇంటికి వచ్చాడు. ఇంట్లోనే కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పిఠాపురం సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణ శేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రేమ పేరుతో మోసగించిన గొల్ల అమర్‌రాజ్‌కుమార్‌కు కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారని టుటౌన్ ఎస్‌హెచ్ఒ తెలిపారు. 2016లో అన్నమయ్య జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన గొల్లా అమర్ రాజ్ కుమార్ అలియాస్ కోనేటి కుమార్ కాకినాడలో ఉంటూ 2016లో 16 ఏళ్ల మైనర్‌ను ప్రేమపేరుతో మోసం చేశాడు. దీనిపై కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పుడి డిఎస్‌పి సూర్యదేవర వెంకటేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితునికి పదేళ్ల జైలు విధించారు. నిందితుడు గొల్లా అమర్‌రాజ్‌పై పలు జిల్లాల్లో చోరీ కేసులు కూడా ఉన్నాయి. చోరీల కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి ఐదేళ్లుగా కోర్టుకు రాకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో నిందితునిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌సైతం ఉంది. నిందితుడిని పట్టుకున్న కాకినాడ టూ టౌన్ పోలీసును ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.

సైన్స్ సమాజాభివృద్ధికి కృషి చేయాలి

ఉభయగోదావరి జిల్లాల రీజనల్ సైన్స్ వర్క్ షాప్‌లో జెవివి నాయకులు

ప్రజాశక్తి మండపేట

సైన్స్ సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని, సమాజాభివృద్ధికి జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు కృషి చేయాలని జెవివి రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఎపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మండపేట అన్నపూర్ణ హైస్కూల్లో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల రీజనల్ సైన్స్ వర్క్ షాపు జరిగింది. ఈ వర్క్ షాప్‌కు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవివి. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవివి. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రశ్న సైన్స్‌కి ప్రధానమని ప్రశ్న పొత్తిళ్లలోనే సైన్స్ పుట్టిందన్నారు. చరిత్ర, మానవ నాగరికతలు పుట్టాయని, సైన్స్ ప్రయోజనాలను ఆధునిక సమాజంలో సమాజాభివృద్ధికి ఉపయోగించాలన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుచున్న దేశవ్యాప్త శాస్త్ర ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని అందుకు జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు కళాజాతల ద్వారా ముందుకు వెళ్లాలని పులుపునిచ్చారు. అనంతరం ప్రజాసైన్స్ గీతాల సిడిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి కెయంయంఆర్.ప్రసాద్, అన్నపూర్ణ విద్యాసంస్థల అధినేత వల్లూరి సతీష్, జెవివిజిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కాజా మొహిద్దీన్, జిల్లా కార్యదర్శి గండి స్వామి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు జనుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు, రాష్ట్ర సీనియర్ నాయకులు జిహెచ్‌పివి.వర్మ, జి.మురళీధర్, పెదపాటి నరసింహారావు, జి.ఈశ్వరరావు, మండపేట పట్టణ అధ్యక్షులు పి.రామచంద్రారెడ్డి, కార్యదర్శి బి.రాజేంద్ర, మండపేట మండల ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, జిల్లా యూత్ కన్వీనర్ ఉద్దండపు గుణ, నేతల అజయ్, యుటిఎఫ్ నాయకులు కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసైన్స్ గీతాల సిడిలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చెలికాని స్టాలిన్ తదితరులు

గోపాలరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన పరమట గోపాలరావు మంగళవారం గుండెపోటుతో మరణించారు గురువారం గోపాలరావు కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి, సీనియర్ నాయకులు పరమట శ్యామ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం గోపాలరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరమట భీమమహేష్ ,కుంచే నాని, సుధీర్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గోపాలరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్యామ్ కుమార్

'ఐద్వా' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా క్యాలెండర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ గురువారం ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి అమిదునిషా, టి. నాగవరలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రకళ, సుశీల, భువనేశ్వరి, లీగల్ సెల్ ప్రెసిడెంట్ పిఎస్.సిరోమణి, సిఐటియు యూనియన్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి పాల్గొన్నారు.



ఐద్వా క్యాలెండర్ నీ ఆవిష్కరిస్తున్న జెసి

ఫొటో, వీడియో గ్రాఫర్లను గుర్తించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గ్రామీణ ఫొట, వీడియో గ్రాఫర్లను ప్రభుత్వం గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కషి చేయాలని లూయీస్ పోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గొల్లవిల్లిలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నట్టుగా తమ వత్తిని కూడా గుర్తించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులకు అసోసియేషన్ గుర్తింపు కార్డులను అందజేశారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి జానా భవాని శంకర్,బొక్కా పుల్లంశెట్టి,జంగా రవికుమార్, దేవదాసు రాజేష్ కుమార్,అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి -యంత్రాంగం

కోడిపందేలు, గుండాట, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అవగాహన సదస్సులు నిర్వహించారు.

మామిడికుదురు సంక్రాంతి పండగలో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండిఆనందంగా జరుపుకోవాలని పి. గన్నవరం సి ఐ ప్రశాంత్ కుమార్ అన్నారు నగరం పోలీస్ స్టేషన్ పరిధిలోగురువారం సమావేశంనిర్వహించారు. మగటపల్లి, గోగన్నమఠం, కొమరాడ వాసులతో సమావేశం అయ్యారు. కార్యక్రమం లో నగరం ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ ఐ, వై సి పి నాయకుల తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం(అల్లవరం)** అల్లవరం మండలంలో సంక్రాంతి సందర్భంగా గుండాట, పేకాట. కోడిపందాలు. అశ్లీలనృత్యాల వైపు వెళ్లకుండా, సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అల్లవరం మండల పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ హరీష్ గురువారం తెలిపారు. ఎవరైనా కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోడి పందాలు నివారించేందుకు తహశీల్దార్, పశుసంవర్ధక శాఖ అధికారి, సామాజిక కార్యకర్తతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని,పందాలు వల్ల కలిగే అనర్థాలను కమిటీ ద్వారా ప్రజలకు తెలియజేయుట జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో 21 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరిగిందని అన్నారు. **అమలాపురం రూరల్** మండలంలో కోడి పందేల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని, అనుమతులు ఉన్నాయని ఎవరైనా ప్రచారం చేసినా నమ్మొద్దని ఎస్ఐ పరదేశి స్పష్టం చేశారు. గురువారం ఆయన కోడిపందేలు నిర్వహించే స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మండలంలో పలు చోట్ల కోడిపందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో కోడి పందేలు నిర్వహించకుండా హెచ్చరికల ఫ్లెక్సీలను పెట్టి ప్రజలకు అవగాహన సదస్సులు పెట్టినట్లు ఎస్.ఐ పరదేశి తెలిపారు. **ఐ.పోలవరం** కోడి పందేలు నిర్వహించకుండా హెచ్చరికలు, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలకు అవగాహన సదస్సులు పెట్టినట్లు రాజేష్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు ఉన్నాయని ఎవరైనా ప్రచారం చేసినా నమ్మొద్దని, కోడిపందేలు నిర్వహించే స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, ఇప్పటికే మండలంలో పలు చోట్ల కోడిపందాల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. కోడిపందేలకు,గుండాటకు, అశ్లీల నృత్యాలకు ఎవరూ సహకరించరాదని ఖాళీ స్థలాల యజమానులకు హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బిసి'

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

అల్లవరం మండల కోడూరుగ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమం గురువారం జరిగింది. అమలాపురం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు , అమలాపురం పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు హాజరయ్యారు. ఆనందరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు, యువత ఉపాధికి తోడ్పాటు అందిస్తే జగన్ ప్రభుత్వం మాత్రం కార్పొరేషన్లో నిధులు కూడా లేకుండా చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



మామిడికుదురులో దీప్తి కళాశాల్లో విజేతలకు బహుమతులు అందిసున్న విప్రో ప్రతినిధులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లా సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం పలు చోట్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంప్రదాయ వేషధారణలు, డూడూబసవన్నలు, రంగవల్లులు, భోగిమంటలు ఆకట్టుకున్నాయి.

ఆలమూరు మండలంలోని చెముడులంక నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు సంక్రాంతి సంబరాలు కరస్పాండెంట్ యెరుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ కె.జాన్ లింకన్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఉప సర్పంచ్ దొండపాటి చంటి, వైసిపి నేతల హాజరై చిన్నారులు వేసిన వేషధారణలు, ఆటపాటలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునంద, ఇంచార్జ్ పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండపేట పట్టణంలోని అక్షర స్కూల్, విద్యా వికాస్, స్వర్ణ భారతి విద్యాసంస్థల ఆవరణలలో సంక్రాంతి సంబరాలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అక్షర స్కూల్ లో డైరెక్టర్స్ విజ్ఞాన్ రాంబాబు, బొప్పన వెంకటరావు, విద్యా సంస్థల ఛైర్మన్ వర్రె పట్టాభి రామన్న పర్యవేక్షణలో ఉపాధ్యాయులు చిన్నారులచే భోగిమంటలు వెలిగించి, భోగి పళ్ళు పోసి, గొబ్బెమ్మలు పెట్టారు. ముగ్గులతో స్కూల్ ఆవరణను అలంకరించడంతోపాటు గాలిపతంగులు, హరిదాసు కీర్తనలతో విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కతిక ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **మామిడికుదురు** దీప్తి డిగ్రీ కళాశాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలుఘనంగా జరిగాయి. ఉదయం నుంచి విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో సంతూర్, విప్రో సంస్థ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీల్లో ముగ్గులు వేశారు. అలాగే భోగి మంట వేసి సందడి చేశారు. పలువురు వక్తలు పండగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ, సహాయ ప్రిన్సిపల్ మోకా రంగారావు, సంతూర్, విప్రో సంస్థ ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, డి.భవానిశ్రీనివాస్, పి.శ్రీరామ్, గో ఫ్రెష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల్లో ముందస్తు సంక్రాంతి శోభా సంతరించుకుంది. ఈ సంక్రాంతి సంబరాలన్నీ కాకినాడ జెఎన్‌టియు నుంచి విచ్చేసిన డా.కె. వెంకటరెడ్డి ప్రారంభించారు. కళాశాల ఆవరణలో విద్యార్థినులు ముగ్గులు వేసి, గొబ్బిమ్మలు పెట్టి భోగిమంటలు చుట్టూ తిరిగారు. పిండివంటలు, గేమ్ స్టాల్స్, గంగిరెద్దులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల పోటీల్ల విజేతలకు బహుమతులు ప్రదా నం చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివి ఎన్ఎస్ వర్మ, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోన మండలం చెయ్యేరులో శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల్లో సంక్రాంతి సంబరాలు



ఆలమూరు మండలం చెముడులంలోని నేతాజీ విద్యార్థుల వేషధారణలు



ఎడ్ల బండపై కూర్చున్న మండపేటలో అక్షర స్కూల్ విద్యార్థులు



సాంప్రదాయ దుస్తుల్లో మండపేటలో విద్యా వికాస్ స్కూల్ విద్యార్థులు

మండల స్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-ఆలమూరు

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయిలో వాలీబాల్ పోటీలు చెముడులంక ఎస్‌టిఎస్ఎన్ఎం జెడ్‌పి హైస్కూల్లో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఎంఇఒ సుబ్బరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఒ రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, హౌసింగ్ ఎఇ డి.శ్రీనివాస్, ఎపిఎం ధనరాజు, ఎపిఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్రాలో మండల స్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో 13 టీములు పాల్గొన్నాయి. ఫైనల్లో చెముడులంక, బడుగువానిలంక గ్రామాల టీములు తలపడ్డాయి. విజేతగా చెముడులంక జట్టు నిలిచిందని ఎంపిడిఒ కె.జాన్ లింకన్ తెలిపారు. విజేతలకు పలువురు అభినందనలుతెలిపారు.



చెముడులంకలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి లక్ష్మణరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మండలంలోని ఉప్పలగుప్తం, చల్లపల్లి 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లల్లో మరమ్మతులతో పాటు విద్యుత్ లైన్లు వెళ్లే మార్గాలలో చెట్లు కొమ్మలు తొలగించే కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డిఇఇ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు.ఈ కారణంగా రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యానాం వార్తలు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యానాం

ట్రాఫిక్ నిబంధనలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో 25 మంది వాలంటీర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఎస్ఐ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడుపరాదన్నారు. చిన్నారులకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదన్నారు. ద్విచక్ర వాహనాలను హెల్మెట్ లేకుండా, కారును సీట్ బెల్టు లేకుండా నడుపరాదన్నారు. అతివేగంతో వాహనం నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సంతకాల సేకరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడలో ఈ నెల 19న అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం జగన్ ఆవిష్కరించనున్నారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా డాక్టర్‌బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలుచోట్ల గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.



సంతకం చేస్తున్న ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి సర్పంచ్ ఊర్మిళా దేవి

ఉప్పలగుప్తం విలసవిల్లి సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఫ్లెక్సీ పై . సర్పంచ్ ఊర్మిళ దేవి తొలి సంతకం చేశారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్,పంచాయతీ కార్యదర్శి దాసరి కష్ణాజీ, విఆర్ఒ, అహ్మదాలీషా,సచివాలయ ఉద్యోగులు,గహ సారథులు, వాలంటీర్ లు పాల్గొన్నారు. **మండపేట** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహన్ని సిఎం జగన్ ఈనెల 19న ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఇప్పనపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి ఉండమట్ల వాసు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు దళిత, పార్టీ నాయకులతో కలిసి సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు గెడ్డం గాంధీ బాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు త్రిశూల శ్రీను, గంగాధర్, ఎంపిటిసి సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.**రామచంద్రపురం** భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమ యనమదల సర్పంచ్ పివి.రమణ అన్నారు. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మేకల గోపి వాకపల్లి రవి, దారా అప్పారావు, సుందరపల్లి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలో ఆయన నివాసం గురువారం కలిశారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని జరిగే మహా కుంభాభిషేకానికి ముద్రగడను ఆహ్వానించేందుకు వచ్చానని నెహ్రూ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తున్న తరుణంలో తనకు మద్దతు తెలపాలని ముద్రగడను కోరానని తెలిపారు. ముద్రగడ వ్యక్తిగతంగా తనకు సంపూర్ణ మద్దతు తెలుపుతానన్నారని నెహ్రూ చెప్పారు. జనసేన నాయకులు కలవడం, జ్యోతుల నెహ్రూ ముద్రగడను కలవడంతో వారి బేటీకి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.



చెక్కు అందజేస్తున్న ఎంపీ బోస్

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

రోడ్డు ప్రమాదంలో గురైన వ్యక్తికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ6.లక్షల 75 వేలు ఎంపీ బోస్ చేతుల మీదగా గురువారం చేశారు. కుర కాళ్లపల్లెకు చెందిన పోలీనాటి వెంకటేష్ కు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది.. అతనికి వైద్య నిమి త్తం సిఎం సహా య నిధి నుంచి రూ.6.75లక్షలు మం జూరయ్యాయి. చెక్కు బాధితుల కుటుంబానికి అందించారు.

టిడిపి హయాంలోనే గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే లంక గ్రామాలు అభివ'ద్ధి చెందాయని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. కేదాలంక, వీధివాలంక, గ్రామాల్లో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ వేగుళ్ళ లీలా కృష్ణ లతో టిడిపి , జనసేన , పార్టీ శ్రేణులతో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు

పశువులకు 'గాలికుంటు' టీకాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బాలాంత్రం గ్రామంలో మండల పశు వైద్య శాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 300 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. సర్పంచ్ చాగంటి సాంబశివరావు వైద్య శిబి రాన్ని ప్రారంభించారు. బాలాంంత్రం గోపాల రావుపేట గ్రామాల నుంచి రైతులు తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

సుంకరపాలెం 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. యానాం వైపు నుంచి వస్తున్న కారు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి సుదర్శన్, అమలాపురానికి చెందిన సూర్య, రాజమహేంద్రవరానికి చెందిన కె.లలిత్ తీవ్రంగా గాయపడ్డారు. కోరంగి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బిక్కవోలు

చెట్టుకు ఉరి వేసుకుని ఒక వ్యక్తి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. బిక్కవోలు గ్రామ శివారు లింగాల చెరువు గట్టుపై ఉన్న చెట్టుకు ఒక గుర్తి తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. చెరువు కాపలా దారుడైన తుమ్మలపల్లికి చెందిన మాదే పాతయ్య ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ బుజ్జిబాబు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. మృతిని శరీరంపై ఎరుపు రంగు బనియన్, పచ్చరంగు షర్ట్ ఉందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రి తరలించారు.